సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



లక్ష్యాన్ని చేరుకోకుంటే..

వన మహోత్సవంలో అధికారులు లక్ష్యాన్ని చేరుకోవాల్సిందేనని.. లేదంటే జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి హెచ్చరించారు. 8లో▸



హామీల అమలులో..

పెన్షన్‌దారులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. 8లో▸



రోగులకు మెరుగైన వైద్యం..

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ డీఎంఈ డాక్టర్ నరేందర్‌కుమార్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా చంద్రారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా అదనపు(రెవెన్యూ) కలెక్టర్‌గా కె.చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం జీఓ జారీ చేసింది. ప్రస్తుతం హెచ్ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్ట్ ఓఎస్డీగా పని చేస్తున్న చంద్రారెడ్డిని ప్రభుత్వం జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమించింది. గతంలో ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పని చేసిన ఎంవీ భూపాల్‌రెడ్డి ఏసీబీ కేసులో అరెస్ట్ కావడం, ఆ తర్వాత అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం, తాజాగా ఆమె మెటర్నిటీ లీవ్‌లో వెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్‌కు మూడు ఎకరాలు కేటాయింపు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా కొత్త భవన నిర్మాణం కోసం ప్రభుత్వం శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 91/2లో మూడు ఎకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసుతో పాటు శేరిలింగంపల్లి, గండిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇక్కడ సొంత భవనాలను నిర్మించనున్నారు. జులై 31న 'సాక్షి'దినపత్రికలో 'గూడు కట్టని నిర్లక్ష్యం..అద్దె భవనాల్లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు'శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. సొంత భవనాలు లేకపోవడం, ఇరుకైన అద్దె భవనాల్లో ఉద్యోగులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలిలో మూడు ఎకరాల భూమిని కేటాయించింది. తక్షణమే ఈ భూమిని స్వాధీనం చేసుకుని, నిర్మాణ పనులు ప్రారంభించవచ్చునని ప్రకటించింది.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి ఉష



యాచారం పీఏసీఎస్ గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న ఉష

యాచారం: జిల్లాలో ఎరువుల కొరత లేదని, డిమాండ్‌ను బట్టి ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఉష హెచ్చరించారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఇంత వరకు విక్రయించిన యూరియా, గ్రోమోర్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. పత్తి, వరి పంటకు సరిపడా యూరియా, గ్రోమోర్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకుని ఎరువులు వాడాలని సూచించారు. మోతాదుకు మించితే పంటకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఆమె వెంట ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్

షాబాద్: పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉంటూ సకాలంలో వైద్యం అందించాలని జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని ఆస్పల్లిగూడ గ్రామంలోని విజయ్‌రెడ్డి డెయిరీని సందర్శించి, పాడి పరిశ్రమపై అవగాహన కల్పించారు. అనంతరం షాబాద్ పశువైద్యశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. పాడి రైతులు పశువులకు సకాలంలో వైద్యం అందిస్తేనే అధిక పాల దిగుబడి వస్తుందని చెప్పారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. పశుపోషణపై దృష్టి సారించి మేలు రకం పశువులకు ఎంపిక చేసుకుని వాటికి నాణ్యమైన గడ్డి జాతులు, దాణా అందించడంతో మరింత లాభం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి, రైతులు తదితరులున్నారు.

దోస్త్ మేరా దోస్త్

సృష్టిలో వెలకట్టలేనిది స్నేహం

- కాపాడుకుంటే కలకాలం పదిలం
- మంచి మిత్రులు దొరకడం గొప్పవరం
- నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం





స్వార్థం లేనిది స్నేహం



ముందుగా రాష్ట్ర, జిల్లా ప్రజలకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.. దేనిలోనైనా స్వార్థం ఉంటుందేమోకానీ స్నేహం విషయంలో ఉండదు. స్వార్థం ఉంటే స్నేహం అనిపించుకోదు.. నిజమైన స్నేహం ఏమీ ఆశించదు. అలాంటి వారు ఉంటే ఎలాంటి కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కోగలం.. అంతటి గొప్ప మిత్రులు నాకు ఉన్నారు. మా స్వగ్రామం తాండూరు.. చదువుకునే రోజుల్లో స్నేహితులతో కలిసి వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆడేవాళ్లం. సుదర్శన్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, రాములు యాదవ్, రమేశ్‌కుమార్, జగన్మోహన్, మధుకర్, వెంకటయ్య నా చిన్ననాటి స్నేహితులు.. బాల్యం మొత్తం వీరితోనే గడిపా. సమయం చిక్కినప్పుడల్లా వీరందరితో మాట్లాడుతుంటా. చిన్నతనంలో చేసిన అల్లరి, సరదాగా గడిపిన రోజులు గుర్తుకు వస్తే మనస్సంతా ప్రశాంతంగా ఉంటుంది. ఆ అనుభూతే వేరు..

– గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన సభ స్పీకర్

స్నేహం గొప్పవరం



ఎవరికైనా స్నేహం అనేది గొప్ప వరం లాంటిది. మంచి స్నేహితులు దొరకడం మరింత అదృష్టమే.. ఈ ప్రపంచంలో ధనిక, పేద అనే తేడా చూడనది స్నేహం ఒక్కటే. దాన్ని దేనితో పోల్చలేము. వెలకట్టలేము.. ఎలాంటి రక్త సంబంధం లేకపోయినా ఫ్రెండ్‌షిప్ కోసం ఏమైనా చేయాలనిపిస్తుంది. స్నేహం చేయడం ముఖ్యం కాదు.. దాన్ని కాపాడుకోవడమే ముఖ్యం.. ఆ ధ్యాస, తపన ఇద్దరిలోనూ ఉండాలి.. అప్పుడే అది కలకాలం పదిలంగా ఉంటుంది. ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేసినా అది నిలబడదు.. సమయం దొరికినప్పుడల్లా చిన్ననాటి మిత్రులతో మాట్లాడతా. వారిని మీట్ అవుతా.

– నారాయణరెడ్డి, ఎస్పీ

గుర్తొస్తే ఒల్లు పులకరించి పోతుంది



కాలంతో పాటు మనం ప్రయాణిస్తున్నప్పుడు మనకు తెలియకుండానే ఎంతో మంది పరిచయం అవుతారు.. అందులో కొందరిని కాలక్రమేణా మరిచిపోతాం.. కొందరు మాత్రం కాలాన్నే మరిపిస్తారు.. వారే మనకు ఇష్టమైన స్నేహితులుగా గుర్తుండిపోతారు.. వెలకట్టలేని అనుభూతిని కలిగిస్తారు.. స్కూల్, కాలేజీ లైఫ్‌లో ఏర్పడిన స్నేహబంధాలు ఎంతో బలపడతాయి.. మా స్వగ్రామం బాన్స్‌వాడ స్కూల్ డేస్‌లో ఇద్దరు మిత్రులు ఉండేవారు.. వారిద్దరూ పదో తరగతిలోనే చదువు మానేశారు. నేను 6 నుంచి ఇంటర్ వరకు నవోదయ స్టూడెంట్‌ని.. పీజీ వరకు హాస్టల్‌లో ఉండి చదువుకున్నా. నా లైఫ్‌లో ఎక్కువ కాలం స్నేహితులతోనే గడిపా. నా ఎదుగుదలకు కూడా వారు ఎంతో దోహదపడ్డారు. ఏటా వారితో మీట్ అవుతా. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటాను.. ఆ సమయంలో ఎంతో ఆనందం కలుగుతుంది. ఏదో తెలియని అనుభూతి చెందుతా. కొన్ని జ్ఞాపకాలు గుర్తొచ్చినప్పుడు నవ్వు ఆపుకోలేను.

– జయసుధ, డీపీఓ

పాతికేళ్ల ప్రయాణం



స్నేహితుడు రవికుమార్‌తో సీఐ శ్రీనివాస్ గౌడ్

శంకర్‌పల్లి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాలకు చెందిన శ్రీనివాస్ గౌడ్, వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం పులుమామిడికి చెందిన రవి కుమార్ శెట్టి బెస్ట్ ఫ్రెండ్స్. వీరిద్దరిదీ వేర్వేరు జిల్లాలైనా 2001లో సంగారెడ్డిలో డిగ్రీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ గౌడ్ శంకర్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. రవికుమార్ మర్పల్లి మండలం కొత్లాపూర్ గ్రామ సెక్రెటరీగా పని చేస్తున్నారు. వీరి పాతికేళ్ల ప్రయాణంలో నిత్యం మాట్లాడుకొని రోజంటూ ఉండదు. మా స్నేహానికి హద్దులు ఉండవని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. కష్ట సుఖాల్లో కలిసే సాగుతామని పేర్కొన్నారు.

చెప్పలేనంత ప్రేమ



చిన్ననాటి స్నేహితుల కుటుంబాలతో కాలకేయ ప్రభాకర్, జడ్జి వినోద్ కుమార్

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన ప్రభాకర్(బాహుబలి చిత్రంలో కాళకేయ పాత్రలో నటించిన వ్యక్తి) సినీ రంగంలో స్థిరపడ్డారు. వినోద్ కుమార్(నాంపల్లి క్రిమినల్ కోర్టు జడ్జి). ఇద్దరికీ చిన్ననాటి స్నేహితులంటే చెప్పలేనంత ప్రేమ. వారితోపాటు పాఠశాలలో చదువుకున్న మిత్రులను ఆప్యాయంగా పలకరిస్తారు. ఉన్నత స్థానంలో ఉన్నా ఎక్కడా వారి గొప్పతనాన్ని ప్రదర్శించరు. ఎప్పటిలాగే బాల్య మిత్రులతో సరదాగా గడుపుతారు. వీరు గ్రామానికి వచ్చిన ప్రతి సారీ స్థానికులు, స్నేహితులతో కలిసిమెలిసి ఉంటారు. ఫ్రెండ్‌షిప్‌కు వీరిచ్చే నిర్వచనమే వేరు..

జంగయ్య యాదికొస్తాడు



జంగయ్య ఇంట్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీఓ యాదయ్య

యాలాల: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వస్పుల్ గ్రామానికి చెందిన గాలి యాదయ్య, సీహెచ్ జంగయ్య ప్రాణస్నేహితులు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ప్రస్తుతం యాదయ్య యాలాల ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. జంగయ్య నగరానికి వలస వెళ్లి లాండ్రీ షాపు నిర్వస్తున్నారు. యాదయ్య కుటుంబంలో ఏ శుభకార్యం జరిగినా, కుటుంబ నిర్ణయాల్లో జంగయ్య పాత్ర ఉండాల్సిందే. ఉద్యోగ రీత్యా దూరంగా ఉన్నా తరచూ ఫోన్‌లో మాట్లాడుతుంటారు. జంగయ్య కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగినా తామంతా వెళ్లాల్సిందేనని యాదయ్య తెలిపారు.

ఇప్పటికీ టచ్‌లో ఉన్నారు



మాది నల్లగొండ జిల్లా మారుమూల కుగ్రామం.. మా గ్రామంలో 3వ తరగతి వరకే ఉండేది.. పదో తరగతి వరకు పక్క గ్రామంలో చదివా.. నాలుగు కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవాళ్లం. వర్షం పడితే స్కూల్ మార్గంలోని వాగు పారేది.. దీంతో డుమ్మా కొట్టేవాళ్లం. ఆ సమయంలో స్నేహితులతో కలిసి ఆడుకునే వాళ్లం.. కలిసి చదువుకునే వాళ్లం.. రోజూ ఆడుతూ పాడుతూ స్కూల్‌కి నడుచుకుంటూ వెళ్లే స్నేహితులను ఇప్పటికీ మరచిపోలేను.. చాలా మంది మిత్రులు ఉన్నారు.. ఒకరిద్దరి పేర్లు చెబితే మిగతా వాళ్లను తక్కువ చేసినట్లవుతుంది. ఏది ఏమైనా చిన్ననాడు ఫ్రెండ్స్‌తో గడిపిన జ్ఞాపకాలు ఎప్పటికీ మర్చిపోలేను..

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

పాతికేళ్ల బంధం మాది



షాబాద్: కష్ట సుఖాల్లో తోడుగా నిలిచే వాడే నిజమైన స్నేహితుడు. అలాంటి మిత్రుడే ఓంకార్. పాతిక సంవత్సరాలుగా ఎంతో అన్యోన్యంగా ఉంటున్నాం. సమయం దొరికినప్పుడల్లా కలుస్తాం. ఇటీవల మరో స్నేహితుడు శ్రీనివాస్‌రెడ్డి రెండు కిడ్నీలు చెడిపోయి మృతి చెందాడు. ఆ కుటుంబానికి స్నేహితులందరూ అండగా నిలిచారు. రూ.7 లక్షలు సేకరించి శ్రీనివాస్‌రెడ్డి పిల్లల పేరిట బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. మా వాడి పిల్లలు అనాథలు కారాదనే ఈ నిర్ణయం తీసుకున్నాం. స్నేహానికి కుల, మత తారతమ్యాలు ఉండవు. అమ్మ నాన్న తర్వాత దేవుడిచ్చిన బహుమతే స్నేహితుడు.

– బి.కాంతారెడ్డి, సీఐ, షాబాద్

ప్రతిఫలం ఆశించనిదే..



స్నేహబంధం ఎంతో విలువైంది. ఇంట్లో వారితో చెప్పుకోలేని విషయాలు కూడా స్నేహితులతో పంచుకోవచ్చు. స్నేహంతో బంధాలు ఎంతో బలపతాయి. ఫ్రెండ్స్‌తో ఉండే ఆనందం వెలకట్టలేనిది.

– సంగమేశ్వర్‌రెడ్డి, టీచర్, తాళ్లపల్లి పాఠశాల, షాబాద్ మండలం

మేమున్నామని..



ఇబ్రహీంపట్నంలో 1983-84 వరకు కలిసి పదో తరగతి చదవుకున్న విద్యార్థుల వదలని స్నేహం

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1983- 84 పదో తరగతి పూర్వ విద్యార్థులు 50 ఏళ్లుగా చెక్కు చెదరని స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకుంటూ మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు ఇటీవల రూ.1.50 లక్షల విలువైన బెంచీలు, బీరువా తదితర సామగ్రిని అందజేశారు. మహిళా దినోత్సవం, ఫ్రెండ్‌షిప్ రోజున ఒక్కచోటకు చేరి పాత జ్ఞాపకాలను నెరమువేసుకుంటున్నారు. వృద్ధాప్యం ముంచుకువస్తున్నా తరచూ కలుస్తూ స్నేహనికి కన్న మిన్న లోకాన లేదురా అని చాటిచెబుతున్నారు.

బాల్య మిత్రులు.. 'బాధ్యత'గా..



కొడంగల్‌లో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న మిత్ర బృందం

కొడంగల్: కొడంగల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన కొందరు విద్యార్థులు 16 ఏళ్ల క్రితం బాధ్యత అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. వారు సంపాదించిన డబ్బులో కొంత సమాజసేవకు వినియోగిస్తున్నారు. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఏటా ఉచితంగా నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేస్తున్నారు. కటుకం వెంకటేశ్, మురహరి వశిష్ట, శివకుమార్ గుప్తా, లక్ష్మీనారాయణ జోషి, కిట్టుస్వామి, కృష్ణారావు, కొంతం సతీష్, నగేశ్, ఆనంద్ కుమార్ లాహోటీ, కానుకుర్తి రమేష్, వేణు, బాలరంగాచారి మంచి స్నేహితులు. ఫ్రెండ్‌షిప్‌కు ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో పాలమూరు జిల్లాను వరదలు ముంచెత్తినప్పుడు ప్రజల సహకారంతో రూ.2.5 లక్షల విలువ చేసే సరుకులు, మందులు, దుస్తులను మాగనూరు మండలంలోని కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో పంపిణీ చేశారు.

40 ఏళ్ల బంధం



స్నేహితురాలు లలితతో శ్రీదేవి

తాండూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన శ్రీదేవి, లలిత మంచి స్నేహితులు. బాల్యమంతా కడపలోనే చదువుకున్నారు. 6వ తరగతి నుంచే మంచి ఫ్రెండ్స్. వివాహ అనంతరం శ్రీదేవి తెలంగాణాలో.. లలిత కర్ణాటకలో స్థిరపడ్డారు. ప్రస్తుతం శ్రీదేవి తాండూరు మండలం జినుగుర్తి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. లలిత బెంగళూరులోని నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. 40 ఏళ్లుగా వీరి స్నేహం కొనసాగుతూనే ఉంది. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటారు. ఏదైనా శుభకార్యం జరిగినా, పండుగలు, వేసవి సెలవులు వచ్చినా కలుస్తారు. కుటుంబ సభ్యులతో సరదగా గడుపుతుంటారు. ప్రపంచంలో వెల కట్టలేనిది స్నేహం మాత్రమే అని శ్రీదేవి తెలిపారు.

ఒకే గిన్నెలో తిన్నాం



నేను నా స్నేహితురాలు స్వాతి ఇద్దరం కే దగ్గర చదువుకున్నాం. నేను ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నాను. స్వాతి వరంగల్‌లో టీచర్‌గా పని చేస్తోంది. మా స్నేహం విడదీయరానిది. మేము చదువుకునే రోజుల్లో ఇద్దరం ఒకే గదిలో ఉండి వాళ్లం. ఒకే గిన్నెలో తిన్నాం. ఇప్పటికీ అదే ఆప్యాయతతో కలిసి ఉన్నాం.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్



పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన వారిని సత్కరిస్తున్న స్నేహ హస్తం ఫౌండేషన్ సభ్యులు

సమాజహితం కోరి..

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1994 – 95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులందరూ 'స్నేహ హస్తం' పేరిట సమాజ సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. సమాజానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో స్నేహ హస్తం ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ సీఐగా పనిచేస్తున్న గజ్జె చరమందరాజు, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ ఫౌండేషన్ కొనసాగుతోంది. అనారోగ్యానికి గురైన బాల్య మిత్రులకు అండగా నిలుస్తున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు.

వారు దేవుడిచ్చిన వరం



విహార యాత్రలో స్నేహితులతో కృష్ణయ్య

చేవెళ్ల: స్నేహం అనేది నాకు దేవుడిచ్చిన వరం. తల్లిదండ్రుల తర్వాత స్నేహితులే ముఖ్యం అని చేవెళ్ల తహసీల్దార్ బి.కృష్ణయ్య అన్నారు. చిన్ననాటి స్నేహితులు పి.శ్రీనివాస్, ఐ.కృష్ణయ్య, కె.నర్సింలు జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. పరిగి మండలం రూప్‌ఖాన్‌పేటకు చెందిన మేమందరం పాఠశాల స్థాయి నుంచే స్నేహితులం. అంతేకాకుండా ఫ్యామిలీ ఫ్రెండ్స్‌గా కొనసాగుతున్నాం. ముగ్గురూ నాకంటే ఒక్క క్లాస్ సీనియర్లు.. మా మైత్రి పదో తరగతి వరకు సాగింది. ఇంటర్, డిగ్రీ వేర్వేరు కళాశాలల్లో చదువుకున్నా రోజూ కలిసేవాళ్లం. వృత్తి రీత్యా వివిధ రంగాల్లో రాణిస్తున్నాం. నేను తహసీల్దార్‌గా, నర్సింలు హెడ్‌కానిస్టేబుల్‌గా. కృష్ణయ్య వ్యవసాయం, శ్రీనివాస్ వ్యాపారం చూస్తూ స్థిరపడ్డాం. ఆదివారం, సెలవు రోజుల్లో కలుసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎవరి కుటుంబంలో సమస్య వచ్చినా కలిసి పరిష్కరించుకుంటాం. మిత్రులందరికీ స్నేహితుల రోజు శుభాకాంక్షలు.

– బి.కృష్ణయ్య, తహసీల్దార్, చేవెళ్ల



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

లక్ష్యాన్ని చేరుకోకుంటే చర్యలు

- జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి
- మీరు పనిచేసే గ్రామ వైశాల్యం, జనాభా తెలియదా?
- పంచాయతీ కార్యదర్శులపై అధికారుల ఆగ్రహం

షాద్‌నగర్‌రూరల్: వన మహోత్సవంలో అధికారులు ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాల్సిందేనని.. లేదంటే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి భాస్కర గార్డెన్‌లో డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు వన మహోత్సవం, పారిశుద్ధ్యం, పోలింగ్ బూత్‌లలో కనీస సౌకర్యాల ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులుతో సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులు అడిగిన ప్రశ్నలకు మండల అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారిపై జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటేందుకు కావాల్సిన గుంతలను తీయలేదని, కనీసం ఎన్ని మొక్కలు నాటాలి, ఎక్కడెక్కడ నాటాలి అనే విషయాలు తెలియకుండా ఏ విధంగా పని చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం తాము పని చేస్తున్న గ్రామానికి సంబంధించిన వైశాల్యం, పాపులేషన్ పంచాయతీ కార్యదర్శులకు తెలియడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల చివరి వరకు ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కృషి చేయాలని, లేని యెడల ఉన్నతాధికారుల ఆదేశాలతో సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం డీపీఓ సురేష్‌మోహన్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహనలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని అన్నారు. తాగునీటి ట్యాంకులు, రోడ్లు, మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంతల్లో నీటి నిల్వ, పెంట కుప్పలు, మట్టి దిబ్బలు, పిచ్చి మొక్కలు, మురుగు నీరు ఉండకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంకుడుగుంతల నిర్మాణం పనులను త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల ఆడిట్ తప్పనిసరిగా మండల పరిషత్ కార్యాలయాలలోనే నిర్వహించాలని అన్నారు. సెక్రటరీలు తమ రోజువారి హాజరును నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికే జిల్లాలో ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్ చేశామన్నారు.

15 మంది సెక్రటరీలకు షోకాజ్‌లు

వన మహోత్సవంలో భాగంగా పది శాతం కన్నా తక్కువ పనులను చేపట్టిన 15 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీలను జారీ చేయాలని ఆదేశించారు. కొత్తూరు మండలం సిద్దాపూర్, మల్లాపూర్, శేరిగూడ భద్రాయపల్లి, కేశంపేట మండలం సుందరాపూర్, దత్తాయపల్లి, చింతకుంటపల్లి, కొందుర్గు మండలం తంగళ్లపల్లి, బైరంపల్లి, మహదేవ్‌పూర్, జిల్లేడ్‌చౌదరిగూడ మండలం చింతకుంటతండా, జాకారం, ఇంద్రానగర్, వనంపల్లి, మల్కాపూర్, పద్మారం పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీలు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి

నందిగామ: ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలు తప్పక చదువుకోవాలని బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. భారత ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారంగా దేశవ్యాప్తంగా చట్టాలపై అవగహన సదస్సులు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థినులకు బెదిరింపు ఉత్తరాలు, ఫోన్ కాల్స్ వచ్చినట్లయితే డయల్ 100 తో పాటు తెలంగాణ లీగల్ సెల్ అథారిటీ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు కాల్ చేయాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉంటే తప్పు చేయడానికి, నేరం చేసిన వారికి మద్దతు పలకడానికి భయపడుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు, హెచ్ఎం సుధాకర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, రహీమొద్దీన్, నర్సింలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదంలో దేశ సార్వభౌమత్వం

- ట్రంప్, మోదీ విరుద్ధ ప్రకటనలతో గందరగోళం
- బీసీ బిల్లుపై కేంద్రం నాన్చుడు ధోరణి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- మొయినాబాద్‌లో సీపీఐ జిల్లా 17వ మహాసభలు



సీపీఐ రంగారెడ్డి జిల్లా మహాసభలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

మొయినాబాద్: ఆపరేషన్ సిందూర్‌కు సిద్ధమైన ఇండియాను యుద్ధం చేయకుండా నిలిపివేశానని అమెరికాలో ట్రంప్ ప్రకటిస్తే.. ఇక్కడ మోదీ విజయం సాధించడానికి తానే పాకిస్తాన్‌ను లొంగ తీసుకున్నానని ప్రకటన చేశారు.. ట్రంప్, మోదీల విరుద్ధ ప్రకటనలతో దేశ సార్వభౌమత్వం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో సీపీఐ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా 17వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. భారతదేశ ఎగుమతులపై అమెరికా 25 శాతం సుంకం విధించినా ప్రధాని మోదీ నోరువిప్పడంలేదన్నారు. దేశ విదేశాంగ విధానం ప్రపంచంలోని ఏ దేశాల మీద ఆధారపడి ఉండదని.. కేంద్ర ప్రభుత్వం మాత్రం విదేశాంగ విధానానికి భంగం కలిగే విధానాలను అమలు చేస్తోందన్నారు. అమెరికా ప్రభుత్వం భారత దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తుంటే ప్రధాని మోదీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపి.. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారనే సాకుతో బీసీ బిల్లుపై కేంద్రం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందన్నారు. బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఏరివేసే లక్ష్యంతో ఎన్‌కౌంటర్లు చేస్తుందని. 2026 మార్చి వరకు మావోయిస్టులు లేని భారతదేశాన్ని నిర్మిస్తామని ప్రకటించడం బాధాకరమన్నారు. కమ్యూనిస్టులు లేకపోతే బూర్జువా వర్గాలు ప్రజల ఆస్తిని, ప్రాణాలను పూర్తిగా హరిస్తాయన్నారు. కమ్యూనిజాన్ని, మార్క్సిజాన్ని అంతం చేయడం ఎవరి తరం కాదన్నారు. కమ్యూనిస్టుల విలువ ప్రజలకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహ, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు నర్సింగ్‌రావు, రామస్వామి, నరసింహ, యాదయ్య, జంగయ్య పాల్గొన్నారు

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ల పట్టివేత

కడ్తాల్: పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను ఆర్టీఏ అధికారులు పట్టుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఆర్టీఏ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే మున్ని ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌తో పాటు, ఓవర్‌లోడ్‌తో కంకరపొడిని తరలిస్తున్న మరో వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని వెహికిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీఏ కానిస్టేబుల్ జగన్, సిబ్బంది ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

మహాగర్జన సన్నాహక సమావేశంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కృష్ణమాదిగ

చేవెళ్ల: రాష్ట్రంలోని పెన్షన్‌దారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తోందని పద్మశ్రీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. శనివారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంద కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో సామాజిక పెన్షన్‌ను రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6వేలు పెంచి ఇస్తామని హామీ ఇచ్చి అమలులో విఫలమైందన్నారు. హామీలు అమలు చేయలేని ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. కొత్త పింఛన్‌ల కోసం అర్హులు పదేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా గత ప్రభుత్వాలు పెన్షన్‌లు పెంచాయని, ఆరోగ్య శ్రీ పథకం అమలు చేశాయని గుర్తు చేశారు. పెన్షన్‌దారుల కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మహాగర్జన నిర్వహించేందుకు నిర్ణయించిందన్నారు. అప్పటి వరకు ప్రభుత్వం దిగిరావాలని.. లేదంటే మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ, రాష్ట్ర, జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఎం.యాదగిరి, ప్రవీణ్‌కుమార్, శంకర్‌రావు, పెంటయ్య, నర్సింలు, వెంకటయ్య, డీఎం.చందు, భాను ప్రసాద్, మహేందర్, నర్సింహ, బాబు, నాయకులు, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

వైద్యారోగ్యశాఖ డీఎంఈ డాక్టర్ నరేందర్‌కుమార్



రోగులతో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ డీఎంఈ డాక్టర్ నరేందర్‌కుమార్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

చేవెళ్ల: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ డీఎంఈ డాక్టర్ నరేందర్ కుమార్ అన్నారు. శనివారం ఆయన జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లుతో కలిసి చేవెళ్ల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని పరిశీలించారు. వార్డుల్లో ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం ఆయన వైద్యులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఓపీ, స్టాఫ్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఆయనకు వివరించారు. సమస్యలపై రిపోర్టు పంపిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళా కానిస్టేబుల్ మృతి



మనీష (ఫైల్)

మీర్‌పేట: కుటుంబ, ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన ఓ మహిళా కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం నాగిళ్లకు చెందిన మనీష (28)కు కడ్తాల్ మండలం పల్లె చెల్కతండాకు చెందిన సుధాకర్‌తో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే భర్త, పిల్లలతో కలిసి ప్రశాంతిహిల్స్‌లో ఉంటున్న మనీష నాలుగేళ్లుగా మీర్‌పేట పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స నిమిత్తం డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కేర్ ఆస్పత్రికి తరలించగా ఆరోగ్యం క్షీణించడంతో శనివారం మృతిచెందింది. తన కూతురి మృతిపై ఎలాంటి అనుమానం లేదని, ఆర్థిక ఇబ్బందులే కారణమని, మృతురాలి తండ్రి కాట్రావత్ కిష్ట ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు.

బంగారం అపహరణలో కేసు నమోదు

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లిలో జరిగిన భారీ దొంగతనం కేసులో పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన చాకలి కృష్ణయ్య ఇంట్లో రూ.15 లక్షల నగదు, 16 తులాల బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం విధితమే. బాధితుడు కృష్ణయ్య గత నెల 27న ఇంట్లో దాచిన బంగారం, నగదు కనబడక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపి కేసు నమోదు చేశారు.

బైక్ దొంగకు రిమాండ్

శంకర్‌పల్లి: బైక్ దొంగతనం చేసిన వ్యక్తిని శనివారం శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బోరబండకి చెందిన పట్లోళ్ల రాజేశ్వర్‌రెడ్డి(42) సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు అలవాటు పడ్డాడు. కొన్నేళ్లుగా 20పైగా దొంగతనాలు చేస్తూ, జైలుకి సైతం వెళ్లి వచ్చాడు. అయితే గత నెల 26న శంకర్‌పల్లి పట్టణంలోని సమ్మయ్య అనే వ్యక్తి తన ఇంటి ముందు తాళం వేసి బైక్‌ని నిలపగా.. రాజేశ్వర్‌రెడ్డి దాన్ని చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా రాజేశ్వర్‌రెడ్డిని సనత్‌నగర్ వద్ద పట్టుకున్నారు. అనంతరం చేవెళ్ల కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని కూలీ దుర్మరణం

మహేశ్వరం: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మహేశ్వరం గేటు సిరిగిరిపురం అర్బన్ ఫారెస్టు వద్ద చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిగిరిపురం గ్రామానికి చెందిన తడకల బాలకృష్ణ(40) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన శనివారం సాయంత్రం మహేశ్వరం గేటు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అర్బన్ ఫారెస్టు వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవ్వడంతో బాలకృష్ణ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బాత్‌రూంలో జారిపడి వలస కూలీ మృతి

మొయినాబాద్: బతుకు దెరువు కోసం వలస వచ్చిన ఓ కూలీ బాత్‌రూంలో జారి పడి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన బంటి(27) అదే ప్రాంతానికి చెందిన పుష్పేందర్, గుజార్‌తో కలిసి మూడు నెలల క్రితం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌కు వలస వచ్చారు. గ్రామ సమీపంలోని పైప్‌లైన్ రోడ్డులో ఉన్న ఆవాసా విల్లాలో టైల్స్, మార్బుల్స్ పనిచేస్తూ అక్కడే ఓ గదిలో ఉంటున్నారు. కాగా శుక్రవారం రాత్రి 8 గంటలకు భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో బంటి బాత్‌రూంకు వెళ్లి అందులో జారి పడ్డాడు. అతని తలకు గాయమైంది. అతనితో ఉన్నవారు నీళ్లు తాగించి పడుకోబెట్టారు. ఉదయం 6 గంటలకు బంటిని నిద్రలేపినా లేవలేదు. వెంటనే స్థానిక భాస్కర ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో చెరువులో పడి మేస్త్రీ..



రాకేష్ (ఫైల్)

కేశంపేట: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాలాల రాకేష్(40) మేస్త్రీ పనులు చేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఆయన గ్రామానికి చెందిన లేగలకాడి శ్రీనుతో కలిసి శివారులోని నాగుల చెరువులో చేపల వేటకు వెళ్లారు. రాకేష్ మద్యం మత్తులో ఉండటంతో చెరువులో పడిపోయాడు. ఆయన్ని రక్షించేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా విఫలమయ్యాయి. అనంతరం మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాంచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.